క్లుప్తంగా

వైభవంగా గణేశ హోమం



విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా దేవాలయ ప్రాంగణంలోని యాగశాలలో వేదోక్తంగా గణేశ హోమం నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు డాక్టర్ రామ్మోనరావు మాట్లాడుతూ పండుగలు, పుణ్యతిథులు వెనక అంతరార్థం తెలుసుకోవాలన్నారు. జ్ఞానాన్ని ప్రసాదించే వినాయకుని పూజించడం అనుచారంగా వస్తోందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ చుట్టుగుంట విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ సీతారామపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 11వ తేదీ గురువారం ఉదయం 7:30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్, విశాలాంధ్ర ప్రెస్ రోడ్, బోయపాటి వారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, స్వాతి ప్రెస్ ఏరియా, కడియాల వారి వీధి, బెల్లపు శోభనాద్రి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, ఎంజీ నాయుడు హాస్పిటల్ ఏరియా, దాసరి వారి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రెయిన్లు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని గంజియలమందయ్య వీధి పక్కన రేషన్ షాప్ సందులో రూ.9,88,000 వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్స్, సీసీ రోడ్ రోడ్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అదే విధంగా నాలుగు స్తంభాల సెంటర్‌లోగల నాగేంద్రస్వామి గుడి కొండపై రూ.7,41,000 ఖర్చుతో నిర్మించనున్న సైడ్ వాల్ ఎత్తు పెంపు, మెట్లు, సైడ్ డ్రెయిన్స్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు మైలవరపు దుర్గారావు, వీరంకి సత్యనారాయణ, ఏఇ రామకృష్ణ, సచివాలయ ఇమ్యూనిటీ సెక్రటరీ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంఎస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):విజయవాడ రైల్వేస్టేషన్ ఆరో నెంబర్ ప్లాట్‌ఫాంలోని ఆర్ఎంఎస్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. తపాలశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధరమూర్తి బుధవారం రిబ్బన్ కట్ చేసి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం ద్వారా రైల్వే ప్రయాణికులు, దగ్గరలోని ప్రజలు వారి ఆధార్ నూతన నమోదులు, సవరణలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం బాల సరస్వతి, అధికారులు, ఇబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథ సాహిత్యం భావి తరాలకు ఆదర్శం



విజయవాడ కల్చరల్: విశ్వనాథ సాహిత్యం భావి తరాలకు ఆదర్శమని మాజీ శాసన సభ్యుడు మల్లాది విష్ణు అన్నారు. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా అలంకార్ సెంటర్‌లోని విశ్వనాథ విగ్రహంవద్ద పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించారు. విశ్వనాథలాంటి సాహితీవేత్తలు కారణ జన్ములన్నారు. ఆయన తెలుగు వారుకావడం తెలుగు వారి పూర్వజన్మ సుకృతమన్నారు. ఆయన రచించిన రామాయణ కల్పవృక్షానికి జ్ఞానపీఠం అవార్డ్ లభించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ కార్యాకర్తలు పలువురు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

- దోమలకు ఆవాస కేంద్రాలుగా ఖాళీస్థలాలు
- జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న నీరు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర శివారు ప్రాంతాలైన కండ్రిక, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, జర్నలిస్టు, ఉడా కాలనీల్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు రోగకారకాలుగా మారాయి. స్థలాలను కొనుగోలు చేసి సంవత్సరాల తరబడి అలాగే ఉంచేస్తున్నారు.

అనారోగ్యానికి కారకాలు..

దీంతో అవి దోమలకు, విషసర్పాలకు ఆవాసకేంద్రాలుగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులకు, పారిశుద్ధ్య సమస్య తోడు కావడంతో ప్రజానీకం వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్నారు.

వైద్యశాలలకు క్యూ..

వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్న వారు 64, 63, డివిజన్లలో ప్రతి రోజూ 60 నుంచి 70 మంది రోగులు ఆయుష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి జ్వరాలకు టాబ్లెట్స్ తీసుకొని వెడుతుంటారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ సస్థలాల్లో పాములు కూడా చేరి రాత్రి సమయాల్లో ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లటానికి భయపడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు విజయవాడ నగర పాలక సంస్థ నోటీసులు జారీ చేసి ఖాళీ స్థలాలను మెరక చేసేందుకు చర్యలు చేపట్టాలని పరిసర కుటుంబాల వారు కోరుతున్నారు.

గతంలో అనేకసార్లు చెప్పినా..

గతంలో అనే దఫాలు ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. వీఎంసీ స్వయంగా మెరక చేసే పనులు చేపట్టి ఆ ఖర్చులను స్థలాల యజమానుల నుంచి వసూలు చేయాలని కోరుతున్నారు. స్థలాల యజమానులు ఖాళీ స్థలాలను మెరక చేసేందుకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంటుందని, స్థలాల ధరలు ఆశించిన మేరకు పెరుగుతాయని కొనుగోలు చేశాం. అయితే బేరాలు లేకపోవడంతో స్థలాల యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఖాళీ స్థలాలను మెరక చేయించాల్సిన బాధ్యత వీఎంసీకే ఉందంటున్నారు.

దోమల బెడద ఎక్కువైంది



ఖాళీ స్థలాల వలన చాలా ఇబ్బందులు వస్తున్నాయి. మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటం వలన దోమలు ఉధృతం అవుతున్నాయి. దీని వలన రోగాలు ఎక్కువగా వస్తుతన్నాయి. నా ఇంటిలో ఇద్దరు చిన్న పిల్లలకు జ్వరాలు వచ్చాయి. నాలుగు రోజుల నుంచి జ్వరం తగ్గడం లేదు. ఆసుపత్రికి వెళితే వైరల్ ఫీవర్స్ అంటున్నారు. ఖాళీ స్థలాలు సక్రమంగా ఉండేలా చూడటం కూడా పరిసరాల పరిశుభ్రతలో భాగమేనని అధికారులు గుర్తించాలి.

– జి.కుమార్, కండ్రిక

తగిన చర్యలు తీసుకోవాలి



ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలబడకుండా వీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని మెరక చేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రైడే ఫ్రైడే అని ప్రచారం చేస్తున్నారు. కానీ ఇక్కడ మురుగు నిరంతరం ఉంటోంది. డ్రై అనేదే లేదు. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– ఎస్.సత్యనారాయణ, కండ్రిక

చర్యలు తీసుకుంటున్నాం



వీఎంసీ పరిధిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను మెరక చేయాలని స్థలాల యజమానులకు నోటీసులు అందచేస్తున్నాము. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు డ్రోన్ల ద్వారా దోమల మందును స్ప్రే చేస్తున్నాము. దోమల లార్వా అభివృద్ధి చెందకుండా గంబూసియ చేపలను నీటిలో వదలుతున్నాము. ఇంకా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ప్రభుదాస్, జోనల్ కమీషనర్ వీఎంసి

దోమ తెరలు ప్రదర్శిస్తూ వినూత్న నిరసన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో దోమల సమస్య విపరీతంగా పెరిగిపోయిందని, ప్రధానంగా బుడమేరు పరిసర ప్రాంతాలలో ప్రజలు దోమల వల్ల కనీసం ఇళ్లల్లో కూడా ఉండలేకపోతున్నారని ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీరాణి అన్నారు. నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో సింగ్‌నగర్ శివాలయం వద్ద దోమతెరలు పట్టుకొని బుధవారం వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుడమేరు వరదలు వచ్చి ఏడాది సమయం దాటినా నేటికి కాలువల్లో పూడికలు సరిగా తీయలేదని, వరదల కారణంగా పాడైపోయిన రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లు పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికి వాటిని అమలుచేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు వెంటనే పరిష్కార మార్గాలను చూపాలని డిమాండ్ చేశారు. సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు ఎస్‌కే దేవికుమారి, విజయలక్ష్మి, మణి, కాశీంబి, సుజిత తదితరులు పాల్గొన్నారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన 'సత్యహరిశ్చంద్రీయం'



సత్యహరిశ్చంద్రీయం నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: శ్రీశారదా కళాసమితి, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో బుధవారం ప్రదర్శించిన సత్యహరిశ్చంద్రీయం నాటకం ఆద్యంతం పద్యనాటక వైభవాన్ని చాటుతూ సత్యవ్రత అవసరాన్ని చాటింది. రచన బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, గుర్రం జాషువా. సత్య హరిశ్చంద్రుడిగా డాక్టర్ నరాలశెట్టి రవికుమార్, చంద్రమతి డాక్టర్ రత్నశ్రీ, విశ్వామిత్రుడిగా ఆచంట బాలాజీనాయుడు, నక్షత్రకునిగా గుర్రపుశాల శీను, లోహితాశ్యునిగా బాబు పాత్రోచితంగా నటించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు మాట్లాడుతూ తెలుగు నాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. నీలం దుర్గారావు, ఎంఆర్ఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులు చింతలపూడి నాగేశ్వరరావు, డాక్టర్ రత్నశ్రీ, ఆచంట బాలాజీనాయుడు, జవహర్‌బాబులకు రంగస్థల పురస్కారాలను ప్రదానం చేశారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉయ్యూరుకు చెందిన జాకీర్ హుస్సేన్ కుమార్తె సయ్యద్ హలీమున్నీసా వివాహం నిమిత్తం నిత్యావసర సరుకులను బుధవారం కండ్రిక కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ ప్రతి నెలా సేవాకార్యక్రమాలను కమిటీ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి పేద ముస్లిం కుటుంబానికి వివాహం నిమిత్తం లక్ష రూపాయల ఆర్థిక సహాయం పెండ్లి కుమార్తె తల్లి బ్యాంక్ ఖాతాలో జమచేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒక్క పేద ముస్లిం కుటుంబానికి కూడా సాయం అందలేదన్నారు. 59వ డివిజన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలాన సాజిద్‌అలీ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సయ్యద్ మౌలాలి, నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్, కమిటీ ప్రతినిధులు రఫీ, రుహుల్లా, అబ్దుల్లా పలువురు పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనారాయణ చిరస్మరణీయుడు

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న అతిథి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పద్మభూషణ్ విశ్వనాథ సత్యనారాయణ తన రచనలతో తెలుగుభాషను సుసంపన్నం చేసి తెలుగు ప్రజల గుండెలలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారని విశ్వనాథ సత్యనారాయణ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కవిసామ్రాట్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు విశ్వనాథ సత్యనారాయణ రచనలు తప్పక చదవాలని సూచించారు. విశ్వనాథ సత్యనారాయణ మరో మనుమడు విశ్వనాథ మనోజ్, విశ్వనాథ వారి పద్యాలను ఆలపించారు. కంచికచర్ల గురుకుల కళాశాల తెలుగు విభాగాధిపతి కె.బాలకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో విశ్వనాథ వారు తన రచనలతో ప్రజలను చైతన్య పరిచారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వనాథ సత్యనారాయణ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ, మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ వల్లూరు నీరజ, కె.బాలకృష్ణ, అధ్యాపకులు మాట్లాడారు. అనంతరం విశ్వనాథ సాహిత్య సర్వస్వ పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. విశ్వనాథ పద్య పఠనపోటీలలో విజేతలైన హర్షిత, మాధురిలకు విశ్వనాథవారి పుస్తకాలను అతిథులు బహూకరించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

భారత సాహిత్య సంపద విశ్వనాథ

విజయవాడ కల్చరల్: భారతీయ సాహిత్య సంపద కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అని కేబీఎస్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టీ శ్రీనివాస్ అన్నారు. సంస్కార భారతి ఆంధ్రప్రదేశ్ శాఖ, కేబీఎస్ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య దినోత్సవం సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతిసభ, విశ్వనాథ సాహిత్యంపై వ్యాసరచన, పద్య పఠన పోటీలను బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, సంస్కారభారతి నిర్వాహకులు పీ భాస్కరశర్మ, రాంకుమార్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బౌద్ధిక్ ప్రముఖ్ దుర్భా శ్రీనివాస్ పాల్గొన్నారు. ద్విశతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌కు విశ్వనాథ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. విశ్వనాథ సాహిత్యంపై నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో గణనాథునికి అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం గణనాథునికి పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గణనాథుని విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ అధికారులు తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు , భక్తులకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సంకట హరచతుర్థిన గణపతికి అభిషేకాలు, పూజలు జరిపించుకున్న భక్తులకు తాము చేపట్టే అన్ని పనుల్లో విజయం సిద్ధిస్తాయి.

అధికారుల తీరుపై ప్రజల మండిపాటు



బాధితుల జాబితాను తెప్పించుకొని కారణాలు తెలుసుకుంటున్న అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరీపేటలో ప్రజలు వాంతులు, విరేచనాలతో హాస్పటల్స్‌కు క్యూకడుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగురోజుల నుంచి మొత్తుకున్నా కానరాని అధికారులు రెండు ప్రాణాలు బలైన తరువాత.. బాధితులు హాస్పటల్స్‌లో అలలమటిస్తున్న తరువాత ఇప్పుడొచ్చి హడావుడి చేయడంపై మండిపడుతున్నారు.

- చవితి పందిర్ల వద్ద ఆహారం తినడం వల్ల అంటూ మాటమార్పుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల మేము ఇలా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నామని మొత్తుకున్నా వినలేదంటున్నారు.
- న్యూఆర్ఆర్ పేటలో ప్రజలు అనారోగ్యాలకు గురికావడానికి ప్రధాన కారణాలు ఏమై ఉంటుందనే దానిపై జిల్లా అధికారులు ఆరా తీస్తున్నారు.

తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్ వద్ద నీటిని ఎప్పుడు శుద్ధిచేశారు. పైపులైన్లు ఎక్కడెక్కడ లీకులు, పారిశుద్ధ్య సమస్య, ఆహారం కల్తీ జరిగిందా అనే విషయాలను తెలుసుకుంటున్నారు. కార్పొరేషన్ జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డీఎంఅహెచ్ సుహాసిని, సీఎంఓహెచ్ అర్జునరావు, ఏఎంఓహెచ్ బాబూ శ్రీనివాసరావు, వాటర్ డీఈ, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలుషిత నీటి వల్లే సమస్య

మా డివిజన్‌లో గత వారం రోజుల నుంచి కలుషిత నీరు వస్తోంది. వీటివల్ల ప్రజలు జ్వరాలు, వాంతులు, విరేచనాల భారిన పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి కార్పొరేషన్ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లాం. తాగునీటి పైపుల లీకుల గురించి కూడా వివరించాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి.

– ఇసరపు రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక పెద్ద

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపక సభ్యులు మాగంటి సరోజనీదేవి సంస్మరణ సందర్భంగా అమ్మ అంశంగా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మ ప్రేమ వెలకట్టలేమన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు సరోజినీ దేవి స్ఫూర్తివంతమైన జీవితం గడిపారన్నారు. మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, బీ వీరభద్రరావు, చావా నరసింహారావు, జోషి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు మధురంగా సాగాయి. గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తి అదృశ్యమైన ఘటన సితారా సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. విద్యాధరపురం సితారా సెంటర్ సారంగం డౌన్‌కు చెందిన వెన్నా శివారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్ కూడా రావడంతో ఆయన మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆయనను ఇంటి వద్దనే ఉంచి వైద్యం చేయిస్తున్నారు. ఈ నెల 2న భార్య జాబ్‌కు, పిల్లలు కాలేజీకి వెళ్లారు. వారు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి శివారెడ్డి కనిపించలేదు. దీంతో భార్య విజయలక్ష్మి భవానీపురం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సిద్ధార్థలో యోగా డిప్లొమా కోర్సులో ప్రవేశాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):తమ కళాశాలలో యోగా ఎడ్యుకేషన్‌లో డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యార్హత కలిగి ఉండాలని, ఈ కోర్సులో ప్రవేశానికి ఎటువంటి వయోపరిమితి లేదని పేర్కొన్నారు. ఈ కోర్సులో భాగంగా రోజూ సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు తమ కళాశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో తరగతులకు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, క్రీడాకారులు కూడా కోర్సులో ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 99639 92102, 81257 89666 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మోసం.. చంద్రబాబు ప్రధాన నైజం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు
- 58వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం



క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎదుటివారిని నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, మోసం చేయడం ఆయన ప్రధాన నైజమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. స్థానిక 58వ డివిజన్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను రాష్ట్ర ప్రజలు నేడు ప్రతి చోటా తలుచుకుంటున్నారని అన్నారు. నాటి ఆదర్శ పాలనకు.. నేటి వంచన పాలనకు ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రజల మధ్య చర్చ జరుగుతూనే ఉందన్నారు. ఒక్క 58వ డివిజన్‌లోనే గడిచిన ఐదేళ్లలో రూ.61 కోట్ల 98 లక్షల 50 వేల 513 మేర పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందారని గుర్తుచేశారు. ఇలా అన్ని ప్రాంతాల్లో, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశామని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్లో కానీ, చేసిన అభివృద్ధి పనుల్లో కానీ సగం కూడా అందడం లేదన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరించాలి

సూపర్ సిక్స్ పథకాలని, సంపద సృష్టి అని, నిరుద్యోగ భృతి అని, స్వర్ణయుగమంటూ చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతూ మోసాలకు పాల్పడుతున్నారని విష్ణు ఆరోపించారు. చంద్రబాబు చేస్తున్న మోసాలన్నింటినీ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజల పక్షంగా నిలబడితే ఈ ప్రభుత్వానికి గిట్టదని, రైతు సమస్యలపై వినతి పత్రాలు అందించడానికి వెళ్తున్నా అక్రమ కేసులను బనాయించే చేతకాని ప్రభుత్వ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని విమర్శించారు. అనంతరం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అలంపూరు విజయ్, వేముల బేబీరాణి, ఎ.రవిచంద్ర, తోపుల వరలక్ష్మి, వసంత్, శోభనాలు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ్యంపై సర్కారు చిన్న చూపు

ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం విమర్శ



ధర్నా చౌక్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ్యాన్ని కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, క్రిస్టియన్ మైనార్టీలను అణగతొక్కటానికి కూటమి ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తోందని, అన్ని మతాలను సమాన దృష్టితో చూడాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం అన్నారు. స్థానిక విజయవాడ ధర్నా చౌక్‌లో బుధవారం క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పుట్టింది టీడీపీ నుంచేనని గొప్పలు చెప్పుకోవటం కాదని, అన్ని మతాలను సమాన దృష్టితో చూడాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినప్పటికీ ఇంతవరకు క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి చైర్మన్, డైరెక్టర్స్‌ను నియమించలేదన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. పాస్టర్స్‌కు 11 నెలల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, అర్హులైన కొత్త పాస్టర్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో చర్చిల నిర్మాణం కొరకు అనుమతులు ఇవ్వాలని, చర్చిల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. జెరూసలెం యాత్రకు నిధులు కేటాయించాలని, గ్రామాలలో సమాధుల తోట కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, పేద క్రైస్తవుల విదేశీ చదువుకు ఒక్కొక్కరికి రూ.కోటి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీసీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు యోవేలు రాజు, ఏఐసీఎఫ్ స్టేట్ కోఆర్డినేటర్ మత్తే రాజ్ కుమార్, మద్దు ప్రేమ జ్యోతి బాబు, డొక్క జార్జి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై వ్యర్థాలు, చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని గుంతలను పూడ్చాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఏఎస్ రామారావు రోడ్, క్రీస్తురాజుపురం, లొయోల కాలేజ్ రోడ్, పంట కాలవరోడ్, పటమట ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కంపాక్టర్ బిన్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.